ప్రజాశక్తి
శనివారం 13 సెప్టెంబరు 2025
5
శ్రీకాకుళం



శ్రీకూర్మానికి బోర్డు ఆఫ్ ట్రస్టీల నియామకం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

గార మండలం శ్రీకూర్మంలోని ప్రసిద్ధ శ్రీకూర్మనాథ స్వామి ఆలయానికి బోర్డు ఆఫ్ ట్రస్టీలను ప్రభుత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఛారిటబుల్ అండ్ హిందూ రెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ చట్టం, 1987లోని 15వ సెక్షన్ ప్రకారం ఈ నియామకం చేపట్టారు. పూసపాటి అశోక్ గజపతిరాజు (వ్యవస్థాపక కుటుంబసభ్యుడు), సభ్యులుగా గుంట్రెడ్డి సంయుక్త, కైబడి కుసుమ కుమారి, పల్ల పెంటయ్య, గొండు శ్రీనివాసరావు, అంధవరపు మనీషా, అరవెల్లి శ్వేతబిందు, తన్ని సూరిబాబు, ఎం.కళ్యాణ చక్రవర్తి, జమ్ము లక్ష్మి (ఎక్స్‌అఫిషియో సభ్యులు), చామర్ల సీతారామ నృసింహాచార్యులు (అర్చకులు)ను నియమించారు. ప్రమాణ స్వీకారం నుంచి రెండేళ్ల పాటు వీరి పదవీ కాలం కొనసాగుతుంది.


ఆశలు రేపారు...

- జిల్లాల విభజన సమస్యలపై మంత్రులతో కమిటీ ఏర్పాటు
- నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం
- గడువు దాటినా పర్యటించని కమిటీ
- కొత్త జిల్లాలు, మండల, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై ప్రజల్లో చర్చ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాల విభజనలో మార్పులు, చేర్పులు, సరిహద్దు సమస్యలపై మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం, ఆ తర్వాత దాని ఊసే ఎత్తడం లేదు. జిల్లాలో మంత్రులు పర్యటించి వినతులు స్వీకరిస్తారని గత నెల ఆరో తేదీన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో పేర్కొంది. ఏయే మంత్రులు ఏయే జిల్లాల్లో పర్యటిస్తారో కూడా షెడ్యూల్‌నూ విడుదల చేసింది. దీంతో కొత్త జిల్లాల ఏర్పాటు, కొత్త మండల కేంద్రాలు, రెవెన్యూ డివిజన్‌ల్లో మార్పుల కోసం పలు మండలాల నుంచి ఇప్పటికే మీ కోసంలో వినతులు సైతం అందజేశారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో అసలు మంత్రుల కమిటీ ఉన్నట్టా?, లేనట్టా అనే చర్చ ప్రజల్లో సాగుతోంది.

పార్లమెంట్ నియోజకవర్గమే ప్రామాణికంగా గత వైసిపి ప్రభుత్వం జిల్లాల విభజన చేపట్టింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా డివిజన్లు, మండలాలు, జనాభా, భౌగోళిక స్వరూపం తదితర అంశాలను అధ్యయనం చేసి కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. 2022 మార్చి 25వ తేదీన కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం ముసాయిదా పత్రం సైతం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం పది నియోజకవర్గాలు ఉండగా, ఎనిమిది నియోజకవర్గాలను శ్రీకాకుళం జిల్లాకు కేటాయించారు. విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, పాతపట్నం, ఆమదాలవలస, పాతపట్నం నియోజకవర్గాలు ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండను, విజయనగరం జిల్లాలో రాజాం నియోజకవర్గాన్ని చేర్చారు. పారిశ్రామికంగా కొంత అభివృద్ధి చెందడంతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీతో పాటు అనేక విద్యాసంస్థలు ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని విజయనగరం జిల్లాలో చేరుస్తాన్న ప్రచారంతో అప్పట్లో



సామాజిక, ప్రజా సంఘాలు, మేధావులు, కవులు, రచయితల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడం, ప్రజాప్రతినిధుల ఒత్తిడితో ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లాలోనే కొనసాగించేందుకు అంగీకరించింది.

విభజనతో సమస్యలు ఉత్పన్నం

జిల్లాల విభజన ఆదివాసీలకు కొత్త సమస్యను తెచ్చిపెట్టింది. ఉమ్మడి జిల్లాలో ఉన్న సీతంపేట ఐటిడిఎ, పార్వతీపురం మన్యం జిల్లాకు తరలిపోయింది. సీతంపేట ఐటిడిఎ ఎప్పటి మాదిరిగానే తన పరిధిలోని మండలాలకు సేవలందిస్తుందని ప్రభుత్వం చెప్పినా, జిల్లాలోని ఐటిడిఎ పరిధిలోని సబ్‌ప్లాన్ మండలాలు, గిరిజన ప్రభావిత మండలాల ఆదివాసీలను పట్టించుకునే వారే కరువయ్యారు. ఐటిడిఎ లేకపోవడంతో గిరిజనులు తమ సమస్యలను చెప్పుకునే వేదిక లేకుండా పోయింది. భామిని మండల ప్రజలు తమను మన్యం జిల్లాలో చేర్చొద్దంటూ ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయింది. పలురకాల పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లడానికి అనేక అవస్థలు పడుతున్నారు. కొత్తూరు మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్ పరిధిలోకి, ఎల్ఎన్‌పేట మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్‌లో చేర్చడంతో అక్కడి ప్రజలు తీవ్ర వ్యయ ప్రయాసలకు లోనవుతున్నారు.

మార్పులు, చేర్పుల కోసం వినతుల వెల్లువ

ఐటిడిఎ ఏర్పాటు అంశం కేంద్రం పరిధిలో ఉండడంతో, అది ఇప్పట్లో జరిగే పని కాదనే అభిప్రాయాన్ని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయంగా సీతంపేట మండలాన్ని జిల్లాలో చేరుస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. సీతంపేట మండలాన్నే చేరుస్తారా, పాలకొండ నియోజకవర్గాన్నీ కలుపుతారా అనేది చూడాల్సి ఉంది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలతో కొత్తగా పలాస జిల్లా ఏర్పాటు చేస్తారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. టెక్కలిని జిల్లాగా మార్చాలని టెక్కలి జిల్లా సాధన సమితి ప్రతినిధులు కోరుతున్నారు. మురపాక, బారువ ప్రాంతాలను మండల కేంద్రాలుగా మార్చాలని వినతులూ వస్తున్నాయి. ఎల్ఎన్‌పేట మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్ నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోకి మార్చాలంటూ మీకోసంలో వినతిపత్రం అందించారు. మంత్రుల సబ్ కమిటీ పర్యటిస్తే మరిన్ని వినతులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తులసీదాస్ తదితరులు

పోరాటాలకు సన్నద్ధం చేయాలి

- పరిశ్రమల పేరుతో పేదల భూములు తీసుకుంటున్నారు
- ప్రజల ఆస్తులను కాపాడుకోవాలి
- పోరాటాలు చేయడమే ఏచూరికి మనమిచ్చే నివాళి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

విద్యార్థి దశ నుంచి ఆఖరు క్షణం వరకు కామ్రేడ్ సీతారాం ఏచూరి సాగించిన ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అన్నారు. సిపిఎం పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని రెవెన్యూ అతిథిగృహంలో 'వర్తమాన పరిస్థితులు - సిపిఎం వైఖరి' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. పరిశ్రమల పేరుతో దళితులు, పేదల భూములను తీసుకుంటున్నారని, కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వడానికి అంగీకరించడం లేదన్నారు. పెత్తందారుల విషయంలో మాత్రం భూ సమీకరణ విధానాన్ని అమలు చేస్తూ వారికి మేలు చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రజల ఆస్తులను పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, బాపూజీ కళామందిరం వంటి ప్రజల ఆస్తులను అమ్మేసేందుకు సిద్ధమవుతోందని, దీన్ని అంతా ప్రతిఘటించాల్సిన అవసరముందన్నారు. ప్రజలకు ఇప్పుడు సమస్యలు పెరుగుతున్నాయని, వాటిపై ప్రజలను సమీకరించి పోరాడాలన్నారు.

చంద్రబాబుకు, జగన్‌కు తేడా లేదు

రీవెరిఫికేషన్ పేరుతో వికలాంగుల ఫించన్లను తీసేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించిన తీవ్ర వ్యతిరేకత రావడంతో కొంత వెనక్కి తగ్గిందని, ఎప్పుడైనా వీటిని తొలగించే అవకాశం లేకపోలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అభద్రతాభావం నెలకొందని చెప్పారు. విద్యుత్ సంస్కరణలు, ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో చంద్రబాబుకు, జగన్‌కు పెద్ద తేడా ఏమీ లేదన్నారు. తన ఎంపీలతో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో ఫోన్ చేయించుకుని ఎన్‌డిఎ అభ్యర్థికి ముందే మాట ఇచ్చానని జగన్ చెప్పడం ప్రజలను మోసగించడమేనన్నారు. చంద్రబాబు, జగన్ మోడీకి ఊడిగం చేస్తున్నారని... సనాతన ధర్మం పేరుతో పవన్ కళ్యాణ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ట్రంప్‌తో స్నేహానికి మోడీ పాకులాట

జాతీయ, అంతర్జాతీయ అంశాల్లో సిపిఎం వైఖరిని స్పష్టం చేయడంలో చూపిన సమయస్ఫూర్తి, స్పందన విషయంలో సీతారాం ఏచూరి ప్రజల్లో బలమైన ముద్ర వేశారని గుర్తు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల మధ్య ఐక్యత, పరస్పర పోటీ నివారణ వంటి విషయాల్లో చాకచక్యంగా వ్యవహరించడం వల్లే బిజెపి మెజార్టీ సీట్లను దక్కించుకోలేకపోయిందన్నారు. నేపాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడటానికి సీతారాం ఏచూరి సూచనలు, సలహాలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. ట్రంప్ విధిస్తున్న వాణిజ్య సుంకాలతో ఆక్వా రైతులు, ఉత్పత్తిదారులు, లెదర్, చెప్పులు వంటి పరిశ్రమలు, డైమండ్ పరిశ్రమలపై ఆధారపడిన కళాకారులు నష్టపోతున్నా ప్రధాని నరేంద్ర మోడీ ఒక్క మాట అనడం లేదని విమర్శించారు. దేశానికి నష్టం కలిగిస్తున్న ట్రంప్‌తో స్నేహానికి మోడీ పాకులాడుతున్నారని విమర్శించారు.

భారత పాలకులు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తారనేది మధురైలో జరిగిన రెండో మహాసభలోనే సిపిఎం చెప్పిందని గుర్తు చేశారు. బీహార్‌లో గెలిచేందుకు ప్రత్యేక ఓటరు సవరణ పేరుతో తమకు ఓటు వేయరనే ఉద్దేశంతో ముస్లిములు, దళితులు, మహిళల ఓట్లను తొలగించేందుకు బిజెపి కుట్ర పన్నిందని చెప్పారు. తెలుగు వారి ఆత్మగౌరవం పేరుతో కేంద్రం పెత్తనానికి వ్యతిరేకంగా నాడు ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపిస్తే నేడు చంద్రబాబు, లోకేష్ నిరంతరం మోడీ జపం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ ఫెడరలిజం స్ఫూర్తిని దెబ్బతీస్తున్న మోడీ చర్యలను ప్రజలకు వివరించాలన్నారు.

సీతారాం ఏచూరిపై ప్రజాశక్తి ప్రచురించిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళ్లర్పించారు. ప్రజా కళాకారుడు చింతాడ రామచంద్రరావు సీతారాం ఏచూరిపై రచించిన గీతాన్ని, పలు అభ్యుదయ గీతాలను ఆలపించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి, పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

అల్లిన పాఠశాలకు తాళం

ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - బూర్జ

మండలంలోని అల్లిన గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు శుక్రవారం తాళం వేశారు. ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాలని ఆందోళనకు దిగారు. ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగిన ఈ స్కూల్‌లో విద్యా సంవత్సర ప్రారంభానికి ముందు 6, 7, 8 తరగతులను ఎత్తివేస్తూ ప్రాథమిక పాఠశాలగా ప్రభుత్వం మార్పు చేసింది. ఆ తరగతుల విద్యార్థులు పాలవలసలో గానీ, పాలకొండలో గానీ చేరాలని విద్యాశాఖాధికారులు తల్లిదండ్రులకు సూచించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో తలొగ్గిన అధికారులు పాలవలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నుంచి డెప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను 6, 7, 8 తరగతులకు పంపించేవారు. విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫారాలు అందజేశారు. ఈ పాఠశాలకు సంబంధించి 6, 7, 8 తరగతుల విద్యార్థుల హాజరు ఆన్‌లైన్‌లో నిలిపివేశారు. ఈ తరగతుల విద్యార్థులను పాలవలస హైస్కూల్‌కు తరలించాలని విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో శుక్రవారం విద్యార్థులను ఉపాధ్యాయులు తరగతుల నుంచి పంపించేశారు. పాలవలస హైస్కూల్‌కు వెళ్లాలని చెప్పడంతో వారు తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పారు. పాఠశాల వద్దకు



పాఠశాలకు వేసిన తాళం

చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు అర్ధాంతరంగా 6, 7, 8 తరగతులను నిలిపివేస్తామని చెప్తే విద్యార్థుల పరిస్థితి ఏమిటని ఉపాధ్యాయులను నిలదీశారు. తాము చేసిందేమీ లేదని, పాలవలస హైస్కూల్‌కు పంపించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని బదులిచ్చారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన వారు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను బయటకు రప్పించి పాఠశాలకు తాళం వేశారు. గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు పాఠశాలకు తాళం వేసిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో సమగ్ర శిక్ష అధికారులు పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలను తెరిపించాలని వారు విజ్ఞప్తి చేసినా గ్రామస్తులు వినిపించుకోలేదు. ప్రాథమికోన్నత పాఠశాలను కొనసాగిస్తేనే తాళాలు తీస్తామని స్పష్టం చేయడంతో, ఉన్నతాధికారుల దృష్టిలో పెడతామని వారు అక్కడ్నుంచి వెళ్లిపోయారు.



పాఠశాల నుంచి బయటకు వచ్చేసిన విద్యార్థులు

విద్యార్థినుల్లో నైపుణ్యాలు అవసరం

ప్రాజాశక్తి - శ్రీకాకుళం సిటీ

విద్యార్థినుల్లో నైపుణ్యాలు అవసరమని మహిళా శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు ఐ.విమల అన్నారు. మహిళలకు చట్టాలు, నైపుణ్యాలపై నగరంలోని శాంతినికేతన్ కాలేజ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ కోసం ఉన్న భద్రతా చట్టాలను తెలుసుకోవాలన్నారు. ఆర్థిక ప్రగతి సాధించాలంటే నైపుణ్యాలు అవసరమని చెప్పారు. చేతివృత్తులు వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళలు విద్యలో ముందుండాలని, తల్లిదండ్రులు సైతం విద్యలో ప్రోత్సహించాలని సూచించారు.

ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

రైతులకు సకాలంలో ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ రైతులకు అవసరమైన యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చే సబ్సిడీలను బడ్జెట్‌లో తగ్గించడం, రాష్ట్రాలకు ఎరువుల కేటాయింపులో కోత విధించడం కొరతకు కారణమన్నారు. జిల్లాకు ఖరీఫ్‌లో 42,200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రభుత్వం 21,644 మెట్రిక్ టన్నులు కేటాయించిందని తెలిపారు. జిల్లాకు చెందిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లాకు సరిపడిన ఎరువులను ఎందుకు కేటాయించలేకపోయారని ప్రశ్నించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి ఇవ్వాల్సిన ఎరువుల్లో కోత విధిస్తే, కేంద్రానికి మద్దతునిస్తున్న టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. రైతులకు ఎరువులు సరఫరా చేయకుండా పర్యావరణం, ప్రకృతి సేద్యం, కేంద్రీయ సాగు, జీవ ఎరువుల పేర్లతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. డబుల్ ఇంజిన్ సర్కారు రైతాంగానికి సబ్సిడీలు తెగ్గోసి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి, భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని కుట్రపన్నుతున్నాయని విమర్శించారు.

17 నుంచి స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్

- స్త్రీల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

స్త్రీల ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన, చికిత్స, పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను అందించేందుకు ఈనెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు జిల్లావ్యాప్తంగా స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కె.అనిత తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో స్త్రీలు, పిల్లలకు అన్నిరకాల వైద్యసేవలందించనున్నామని చెప్పారు. స్త్రీల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని హెల్త్ క్లినిక్‌లు, ప్రాథమిక, పట్టణ, సామాజిక, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా వైద్య కళాశాల ఆస్పత్రుల ఆధ్వర్యాన ప్రత్యేక వైద్య నిపుణుల సహకారంతో



మహిళలు, పిల్లల కేంద్రీకృత ఆరోగ్య శిబిరాలు నిర్వహణ, స్క్రీనింగ్ అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వైద్యుల సహకారంతో వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులు నుంచి ప్రత్యేక సేవలను అందించనున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలను నిర్వహించడానికి ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రైవేటు వైద్య నిపుణులను భాగస్వామ్యం చేయడం ద్వారా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - పొందూరు

మండలంలోని పలు ఎరువుల, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రం పరిధిలోని మల్లిఖార్జున ట్రేడర్స్, లక్ష్మీపేట వద్ద గల వేదవర్షి ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచినా, పురుగుమందులను అధిక ధరలకు విక్రయించినా లైసెన్సులను రద్దు చేసి చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ సిఐ డి.వి.వి సతీష్ కుమార్, తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎస్ఐ బి.రామారావు, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు కృషి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు సుధాకరరావు అన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యాన ఉల్లాస్ కార్యక్రమంపై నగరంలోని జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో వాలంటీర్లకు శుక్రవారం వృత్యంతర శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యతను పెంచే విధంగా వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. నిరక్షరాస్యులను పక్కాగా గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మండల స్థాయిలో అక్షరాస్యతను పెంచాలని చెప్పారు. 15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులు అందరినీ అక్షరాస్యులుగా మార్చడం కీలకమని తెలిపారు. వారికి ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం, ఇతర జీవిత నైపుణ్యాలను అందించడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో అక్షరాస్యత సాధించాలంటే మండల స్థాయిలో గ్రామాల్లో స్వచ్ఛందంగా వాలంటీర్లు బోధన చేయాలన్నారు. వయోజన విద్య జిల్లా ఉప సంచాలకులు సోమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో 11,207 మంది వాలంటీర్లకు నైపుణ్యం గల ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చి 1.12 లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం కోసం కషి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దలకు చదవడం, రాయడం నేర్పే విధంగా వాలంటీర్లు శిక్షణ ఇవ్వాలన్నారు. రిసోర్సుపర్సన్లు కె.వెంకటరమణ, పి.వెంకటరమణ, ఉపాధ్యాయులు వాలంటీర్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ చంద్రకుమారి, వయోజన విద్యాశాఖ ఎపిఒ బాలచంద్ర, పర్యవేక్షకులు ఎల్.రవణమ్మ, ఎంపిడిఒలు, ఎపిఒలు, ఎపిఎంఎస్‌లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

షేర్ నెట్‌పై అవగాహన

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

మండలంలోని కాపు గోదాయవలసలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, ఉద్యానవన శాఖ జెడి చంద్రశేఖర్ షేర్ నెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. షేర్ నెట్ లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కార్యక్రమ లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ఇప్పటికే నిర్మించిన షేర్ నెట్‌ను ఆదర్శంగా చూపి, లబ్ధిదారులు తమ భూముల్లోనూ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపిఎం నారాయణరావు, సర్పంచ్ లక్ష్మీ జనార్ధన్, సంతబొమ్మాళి ఎపిఎం శ్రీనివాసరావు, పలు మండలాలకు చెందిన వెలుగు ఎపిఎంలు, సముదాయ కోఆర్డినేటర్లు, మండల ఉద్యానవన శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



థర్మల్ ప్లాంట్ ఎవరి కోసం..?

- 18న కలెక్టరేట్ వద్ద మహా ధర్నా
- వామపక్ష, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు

వార్త... మెయిన్ పేజీలో


ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కమ్యూనిస్టు యోధుడు ఏచూరి

రణస్థలం: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శి అని సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు అన్నారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా రణస్థలంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేసిన పోరాట యోధుడన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తుల సమన్వయ రథసారథిగా సీతారాం ఏచూరి దేశ ప్రజానీకానికి చేసిన కృషి అమోఘమైనదని, విద్యార్థి దశ నుంచి మూడు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసిన ఆయన మరణం కష్టజీవులకు నష్టమని అన్నారు. ఎన్నో గడ్డు పరిస్థితులను అధిగమించి, అనేక త్యాగాలతో, జైలు జీవితానికి సిద్ధపడి, పోరాట జెండాను ఎగురవేసిన ఏచూరి మన మధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో వెలమల రమణ, గురునాయుడు, వి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శశిధర్

కవిటి: సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజపురం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ శశిధర్ తెలిపారు. మండలంలోని కపాసుకుద్దిలో ముందస్తు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులను పరీక్షించి సలహాలు, సూచనలు అందించారు. అనంతరం డాక్టర్ శశిధర్ మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో జ్వరాల తీవ్రత లేదని, ఒకరిద్దరిలో మాత్రమే జ్వరాల లక్షణాలు కనిపించాయని తెలిపారు. అదేవిధంగా గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని కార్యదర్శి మన్మథరావుకి తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'రణభేరి'ని జయప్రదం చేయాలి


ఆమదాలవలస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు నిర్వహించే యుటిఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వి.వి భాస్కరరావు, పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల, లక్ష్మీనగర్, గేదెలవానిపేట, మెట్టక్కివలస, చింతాడ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలల వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పిఆర్‌సి కమిషన్ నియామకం, 30 శాతం ఐఆర్ ప్రకటించడం, నాలుగు పెండింగ్ డిఎల చెల్లింపు, ఆర్థిక బకాయిల విడుదల, సిపిఎస్ విధానం రద్దు, మెమో 57 అమలు, బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను విముక్తి చేయడం వంటి డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు తమ్మినేని పాపారావు, చింతాడ వెంకటరమణమూర్తి, మెండ శ్యామలరావు, ఎస్.ధనుంజయరావు, గొర్లె రమేష్, కె.సిద్ధు, కె.సాయి, హెచ్‌ఎంలు పి.వి. రమణమ్మ, బొడ్డేపల్లి రామకృష్ణ, తలశిలభాయ్, ఎం.విజయలక్ష్మి, ఎస్.సరితాదేవి, లత తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఏ ఒక్క డిమాండ్ నెరవేర్చలేదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబూరావు ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. మందస మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలను సందర్శించి ఈ నెల 15న యుటిఎఫ్ చేపడుతున్న రణభేరి జాత కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. జిఆర్ పురం, మందస, భైరి సారంగపురం, సొండి పూడి, హరిపురం ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోగా, ఉపాధ్యాయులను సమాజంలో దోషులుగా చిత్రీకరించే పని జరుగుతుందన్నారు. ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వమే విద్యా వ్యవస్థను బలహీన పరచిందని, తాత్కాలిక నియామకాలే తప్ప శాశ్వత నియామకాలు లేని వ్యవస్థగా పర్యవేక్షణా వ్యవస్థ తయారైందన్నారు. బదిలీలు, ప్రమోషన్లు పూర్తయి మూడు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులు ఇంకా పాత స్థానాల్లోనే పని చేయాల్సిన పరిస్థితి. ఉందని, మూడు నెలలుగా మినిమం టైం స్కేలు టీచర్లకు జీతాలు లేకున్నా అధికారులకు పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో పిన్నింటి కొండలరావు, జిల్లా కౌన్సిలర్ గున్న చంద్రశేఖర్, జి ఆర్ పురం, మందస, భైరి సారంగపురం, హరిపురం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమణమూర్తి, శ్రీనివాసరావు, బొడ్డేపల్లి గోపీచంద్, స్వప్న, మురళి, రామారావు, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, మల్లికార్జునరావు, పిజిటి రమణ బాబు, గుంట తేజేశ్వరరావు, దున్న కృష్ణారావు, నాగమణి, తులసి, ఎల్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సోంపేట: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి


మృతి చెందిన సురేష్

కోటబొమ్మాళి: మండలం కిష్టుపురం గ్రామ సమీపంలో 33 కెవి విద్యుత్ లైన్‌కు తగిలిన చెట్టు కొమ్మలను తొలగించటానికి వచ్చిన జలుమూరు మండలం టెక్కలిపాడులో పనిచేస్తున్న జూనియర్ లైన్‌మెన్ మామిడి సురేష్ (33) విద్యుత్ షాక్‌తో శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు మృతుడు సురేష్ జలుమూరు మండలంకు చెందిన పలువురు విద్యుత్ సిబ్బందితో కలిసి తమ మండలానికి వెళ్లే 33 కెవి విద్యుత్ లైను సరఫరా నిలుపుదల చేసి ఆ లైన్‌కు తగిలిన చెట్టు కొమ్మలను కమ్మకత్తితో తొలగించి తిరిగి వెళ్లిపోతున్న సమయంలో పక్కన ఉన్న11కెవి విద్యుత్ లైన్‌కు కమ్మకత్తి తగలడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడకక్కడే సురేష్ మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సత్యన్నారాయణ తెలిపారు.

ఆటో డ్రైవర్ల కొట్లాట

రణస్థలం: మండల కేంద్రం రావాడ రోడ్డు పోలీస్ క్వార్టర్స్ సమీపంలో ఉన్న ఆటో స్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం ఇద్దరు ఆటోడ్రైవర్లు నడిరోడ్డుపై రక్తాలు వచ్చినట్టు కొట్టుకున్నారు. ఎంత మంది విడిపించేందుకు ప్రయత్నం చేసినా ఆగకుండా కొట్టుకున్నారు. రణస్థలం మండలంలో పలు ఆటో స్టాండ్‌లలో ఆటో సీరియల్ కోసం డ్రైవర్లు కొట్టుకోవడం ఒక సాధారణ సమస్యగా మారింది. ముఖ్యంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ఎక్కువ మంది ప్రయాణికులు ఉన్నప్పుడు ఈ సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి.


బోల్తా పడిన లారీ

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

శ్రీకాకుళం సిటీ: జన విజ్ఞానవేదిక 18వ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 13, 14 తేదీల్లో విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా పీపుల్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ కార్యదర్శి ఆశా మిశ్రా, పూర్వ ఎమ్మెల్సీలు డాక్టర్ కె.నాగేశ్వర్, వి.బాల సుబ్రహ్మణ్యం, కె.ఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని, మహా సభలకు జిల్లా నుంచి జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకత్వం పాల్గొంటుందన్నారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, స్వావలంబన అంశాలపై చర్చించి శాస్త్రీయ సమాజ నిర్మాణంకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు.


ఇంజిన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం మంచినీళ్లపేటలో మత్స్యకారులకు వలలు, ఆయిల్ ఇంజన్లు, ట్రాన్స్ పౌండర్‌లు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి రాయితీతో 27 మంది మత్సకారులకు ట్రాన్స్ పౌండర్‌లు అందజేశారు. 21 మంది మత్స్యకారులకు రూ.పదిహేడు లక్షల పదమూడు వేలు రాయితీతో వలలు, ఇంజన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 15 నెలల కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామన్నారు. ఉచితబస్, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాలు అమలు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుళ్ళ చిన్నారావు, ఆకుల పాపారావు, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, గోవింద పాపారావు, గాడి అఖిల్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కొనారి కిరణ్ కుమార్, వంక రామారావు, నెయ్యిల సూర్యనారాయణ, మత్స్య శాఖ అధికారి ధర్మరాజ్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకించాలి



టెక్కలి రూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

టెక్కలి రూరల్: షెడ్యూల్ కులాల వర్గీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో భాగంగా శుక్రవారం టెక్కలిలో ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జెఎసి నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా 20 శాతానికి రిజర్వేషన్ పెంచాలని, షెడ్యూల్ కులాల్లో ఉన్న 59 కులాలను విడదీయడం రాజ్యాంగ విరుద్ధమని నినాదాలు చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తుళ్లిబిల్లి అశోక్‌బాబు, న్యాయవాది డాక్టర్ దాసరి చెన్నకేశవులు, స్థానిక వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు, డాక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచాలని, ఎస్‌సిలకు ప్రైవేటు రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలని, దళిత క్రైస్తవులకు ఎస్‌సి రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో చల్లా రామారావు, నుంకు గోపీనాథ్, బి.ధనంజయ, రాహుల్, ఎర్రగడ్డయ్య, కురమాన బాలకృష్ణ, జర్యాడ జయరాం, కుప్పిలి కామేశ్వరరావు, ఆంధ్ర స్టాలిన్, జర్జన చంద్రశేఖర్ తదితరులుపాల్గొన్నారు.

పలాస: రాజ్యాంగ వ్యతిరేక వర్గీకరణను రద్దు చేయాలని రాష్ట్ర దళిత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు టి.అశోక్ బాబు, పబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియన్ స్థాపకులు చెన్నకేశవులు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా దళిత హక్కుల పరిరక్షణ సమితి నాయకులతో కలిసి కాశీబుగ్గలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. గౌరవ అధ్యక్షులు పిలక కృష్ణారావు, అధ్యక్షులు పాపారావు, సభ్యులు తుంగాన శంకరరావు, చెల్లూరి పద్మలోచన, కృష్ణ, జీవన్ బాబు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ఐతమ్ విద్యార్థులకు బహుమతులు


విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ తదితరులు

టెక్కలిరూరల్: టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ మూడవ ఏడాది చదువుతున్న విద్యార్థులు పశ్చిమ గోదావరి జిల్లాలోని స్వర్ణ ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన 24 గంటల హ్యాకతోన్ కార్యక్రమం పోటీల్లో 130 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొనగా, స్మార్ట్ అగ్రికల్చర్ డోమైన అనే పరిశోధనలో ఐతమ్ కళాశాల విద్యార్థులు, ఆర్.దుర్గా పవనకుమార్, ఎం.శ్రీనివాస్, కె.అఖిలేష్, జి.అశ్రీత్‌ల బృందం ప్రథమ స్థానం దక్కించుకొని రూ.20 వేలు నగదు బహుమతి పొందినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరావు తెలిపారు. స్మార్ట్ వ్యవసాయ విధానంలో సెన్సర్ లొకేషన్ సిస్టమ్ వ్యవసాయ ఉత్పత్తిలో స్థిరత్వాన్ని మెరుగు పర్చడానికి అధునాతన సాంకేతికతలను, మొబైల్‌యాప్ ఆధారిత పంట నిర్వహణను ఉపయోగించటం ద్వారా విద్యార్థులకు ఖచ్చితమైన వ్యవసాయ నైపుణ్యం పెరుగుతుందని, ఆచరనాత్మక జ్ఞానం అందించడానికి ప్రస్తుత తరుణంలో ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సిఎస్‌ఇ హెచ్‌ఒడి డాక్టర్ వై.రమేష్ విద్యార్థులను అభినందించారు.

రాజ్యాధికారం కోసం ఐక్యం కావాలి


మాట్లాడుతున్న గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాజ్యాధికారం కోసం అఖిల గాండ్ల తెలికులు ఐక్యం కావాల ని అఖిల గాండ్ల తెలికు ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షు లు కొమనాపల్లి లక్ష్మణ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి దాసరి జ్ఞానమూర్తి అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 14న సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక సదస్సును నగరంలోని సన్‌రైజ్ హోటల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు సంఘ రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరవ అనంతం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా మధుసూదన్‌తో పాటు అన్ని జిల్లాలకు చెందిన కార్యవర్గ ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. సుమారు 25 లక్షల మందికి పైగా జనాభా కలిగిన గాండ్ల తెలికుల సమాజిక తరగతికి కార్పొరేషన్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, రాజ్యాధికారంలో భాగస్వామ్యం, సాధికారిత అజెండాతో పాటు మరికొన్ని కీలక సమస్యలపై సదస్సులో చర్చించి దిశానిర్దేశం చేయనునట్లు తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

టమోటా లారీ బోల్తా

లావేరు: మండలంలోని తాళ్లవలస పంచాయతీ రావివలస సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం రోడ్డుపై టమోటా లార్తీ బోల్తా పడింది. ఈ లారీ గుంటూరు నుంచి ఒడిశా రాష్ట్రంలోని పూరీకి టమోటాల లోడుతో వెళ్తుంది. రావివలస సమీపంలోకి వచ్చినప్పటికి ముందు వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో ఒక్కసారిగా లారీ రహదారిపై అడ్డంగా బోల్తాపడింది. దీంతో లారీలోని టమోటాలు రోడ్డుపై చిందర వందరగా పడి చెల్లా చెదురుగా పడుపోయాయి. డ్రైవర్ అశోక్‌కు స్వల్పంగా గాయాలవ్వడంతో స్థానికులు 108 వాహనంలో రణస్థలం సిహెచ్‌సికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

వైసిపి జిల్లా యూత్ సెక్రటరీగా ఈశ్వరరావు

బూర్జ: మండలంలోని నీలాదేవిపురానికి చెందిన దేవకూట ఈశ్వరరావు వైసిపి జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా నియమితులైనట్టు ఆమదాలవలస నియోజకవర్గ వాలంటరీ విభాగ అధ్యక్షులు ఇప్పిలి తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావును నియోజవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు అభినందనలు తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపిపి మురళి

అధికార పార్టీ వారికే యూరియా ఇస్తారా?

నరసన్నపేట: అదికార పార్టీకి చెందితే చిన్నవారికైనా గౌరవం ఇస్తున్నారు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లను కూడా పట్టించుకోవడం లేదని స్థానిక ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అధికారులపై ధ్వజమెత్తారు. శుకవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఆరంగి మురళి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులు ఈ మూడు నెలల్లో చేసిన కార్యక్రమాలను వివరించారు. ఎఒ సూర్యకుమారి మాట్లాడుతుండగా ప్రజా ప్రతినిధులు ఆమె ప్రసంగాన్ని అడ్డుకున్నారు. యూరియా పంపిణీలో అవకతవకలు జరిగాయని, కేవలం అధికార పార్టీ నాయకుల మాటలు విని పంపిణీ చేసారని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు మండిపడ్డారు. అలాగే వంశధార కాలువ పనులు కొన్ని ప్రాంతాల్లో సక్రమంగా నిర్వహించలేదని ఎఇ హరిషను నిలదీశారు. పల్లెపండగ పనులు నిర్వాహణలో జాప్యం, చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని మండల ఇంజినీరుపై మాకివలస సర్పంచ్ మోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపిటిసిల తీర్మానం లేకుండా అన్న క్యాంటీన్ భవనం నిర్మాణానికి పనులు ప్రారంభం చేశారు. ఈ నిర్ణయాన్ని సభ్యులంతా పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటిండెంట్ విజయానంద్, జెడ్‌పిటిసి చింతు రామారావు, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలం తర్లాకోట, శాసనాం గ్రామాల్లో జలజీవన మిషన్‌లో భాగంగా రూ. 1.50 కోట్లు వ్యయంతో మంచినీటి పథకం నిర్మాణం చేపట్టేందుకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ కొళాయిల ద్వారా మంచినీరు అందించాలని ప్రధాని, సిఎం, డిప్యూటీ సిఎం కల జలజీవన్ మిషన్ ద్వారా నెరవేర్చడం జరుగుతుందన్నారు. ప్రతీ పంచాయతీకి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చడం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో చేయలేని అభివద్ధి ఒక్క ఏడాదిలో చేసి చూపించి మంచి ప్రభుత్వానికి ఓట్లు వేసిన ప్రజల్లో నమ్మకం కల్పించామన్నారు. నేపాల్లో చిక్కుకుక్క తెలుగు వారికి వారి స్వస్థలానికి చేర్చిన ఘనత యువనేత లోకేష్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, మండల టిడిపి అధ్యక్షులు కుత్తుమ లక్ష్మణకుమార్, పి.విఠల్, దువ్వాడ సంతోష్, దల్లి ప్రసాద్, కిక్కెర ఢిల్లీరావు, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ సూర్యనారాయణ, ఎఇ ధనుంజయ, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

యువతకు రాజకీయ చైతన్యం అవసరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

యువతలో రాజకీయ చైతన్యం అవసరమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. నగరంలోని క్రిస్టల్ పేలస్‌లో వినీల్ విశ్వంబర్ దత్ ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులపై రాసిన అండర్ కరెంట్ పుస్తకాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో రాజకీయ చైతన్యం పెరుగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను అధ్యయనం చేసి రాసిన ఈ పుస్తకాన్ని యువతరం చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలి

ప్రజాశక్తి- నందిగాం

పదో తరగతి విద్యార్థులు ఫలితాల సాధనలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరమని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు అన్నారు. పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం శుక్రవారం పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు మెరుగుకు తీసుకుంటున్న చర్యలు వివరించారు. పాఠశాల ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు కురమాన దాలయ్య విద్యార్థుల ప్రగతి, తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం మెదటి ఎఫ్ఎ పరీక్షల్లో ముందంజలో ఉన్న మెదటి ముగ్గురు విద్యార్థులకు హెచ్‌ఎం సౌజన్యంతో మెడల్స్ బహుకరించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చమళ్ల సీతారాం, ఉపాధ్యాయులు తులసీ ప్రసాద్, వై.నాగేశ్వరరావు, గోవిందరాజు, ప్రియదర్శిని, బెందాలం రత్నం, ఉపాధ్యాయులు, పదోతరగతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఎరువులు పక్కదోవ పట్టించారు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రైతులకు ఎరువులు సరఫరా చేయకుండా కూటమి ప్రభుత్వం యూరియా పక్కతోవ పట్టించారని పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి రోణంకి ఉమా మల్లేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గంగరాం సర్పంచ్ ప్రతినిధి పేడాడ వెంకటరావు, మాసాహెబ్‌పేట సర్పంచ్ ప్రతినిధి హేమసుందరరాజు, మండల విప్ బొడ్డు అప్పన్నలు కనీసం 20 శాతం ఎరువులు సరఫరా చేయకుండా ప్రైవేట్ షాపులకు మళ్లించారని టెక్కలి వ్యవసాయశాఖ ఎడి జగన్మోహన్‌రెడ్డిని నిలదీశారు. ఈ ఖరీఫ్‌కు 16.600 ఎకరాలను గుర్తించటం జరిగిందని, ఇప్పటికే 1047 మెట్రిక్ టన్నుల ఎరువులు మండలానికి సరఫరా అయ్యిందని ఆయన సభ్యులకు సమాధానం చెప్పారు. ఇంకా 198 మెట్రిక్ టన్నుల ఎరువులు రావాల్సి ఉందని వివరించారు. కొత్తపేట పంచాయతీలో సాగునీరు కాలువలు పనులు చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బంది కలుగుతుందని ఎపిఒ హరిప్రసాద్ దృష్టికి మండల ఉపాధ్యాక్షులు దుక్క రోజారామకృష్ణరెడ్డి తీసుకువచ్చారు. సమావేశంలో తహశీల్దార్ అప్పలరాజు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల ఉపాధ్యాక్షుడు బోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో యూరియాపై రచ్చ


మాట్లాడుతున్న ఎంపిపి రజని

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. పలు సమస్యలపై అధికారులను ఎంపిటిసిలు, సర్పంచ్‌లు నిలదీసి ప్రశ్నించారు. యూరియా సమస్యపై జెడ్‌పిటిసి టొంపల సీతారాముడు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు భగ్గుమన్నారు. పోడియం ఎదుట నిలబడి వ్యవసాయాధికారి విజయ భాస్కరరావును నిలదీశారు. వచ్చిన యూరియాను కూటమి నాయకులు రైతులకు అందకుండా రైతులకు అన్యాయం చేసి యూరియాను పట్టుకుపోతున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి సమాధానం చెబుతూ ఇవన్నీ ఆరోపణలు తప్పా అటువంటిది ఏమి జరగడం లేదని, యూరియా కోసం వచ్చిన రైతులకు ఉన్న దాంట్లో సర్ధుబాటు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే కమ్మసిగడాం సర్పంచ్ ప్రతినిధి సింక అప్పారావు ఐసిడిఎస్ పిఒ రూపవతిని నిలదీశారు. లోచెర్లపాలేం అంగన్వాడీ కేంద్రం నిర్మాణం సగంలో నిలిపివేసారని, ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరిన భవనంలో నడుస్తోందని ఆ భవనం పిల్లలపై పడిపోతే ఎవరిది బాధ్యతని నిలదీశారు. తక్షణమే భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్.జి.ఆర్. పురంలో విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడుతుందని సరిచేయాలని సభ్యులు కోరారు. మండలంలో చాలా మంది రేషన్ డీలర్లు 60 ఏళ్లు దాటిన వారికి, వికలాంగులకు రేషన్ బియ్యం ఇంటికి తెచ్చి ఇవ్వడం లేదని సభ్యులు తెలిపారు. తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ మాట్లాడుతూ అటువంటి డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎంపిపి రజని, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ మాట్లాడుతూ వర్షాలు పడుతున్నాయని, గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. అలాగే వైద్యులు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు సలహాలను అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మార్కండేయులు పాల్గొన్నారు.

చదువు చెప్పేదెలా?

ప్రజాశక్తి- కవిటి

మండలంలో ప్రాథమిక, హైస్కూల్ విభాగాలకు సంబంధించి 130 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో తాము విద్యార్థులకు నాణ్యమైన విద్య ఏ విధంగా బోధించాలని ఎంఇఒలు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి కడియాల పద్మ అధ్యక్షతన శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఇఒలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కొరతతో చాలా పాఠశాలల్లో సమస్యలు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా ఉపాధ్యాయుల సర్దుబాటు తలకు మించిన భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మండలంలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియామకం జరిగేలా చర్యలు తీసుకోవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి కడియాల పద్మను కోరారు. అనంతరం ఎంపిటిసిలు పూడి నీలాచలం, పిరియా కృష్ణారావు మాట్లాడుతూ ఉద్దానం మంచినీటి పథకంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న చాలామందిని అకస్మాత్తుగా తొలగించారని దీంతో వారి కుటుంబాల రోడ్డున పడ్డాయని తెలిపారు. ఏమని అడిగితే మెగా ప్రాజెక్ట్ పేరు చెబుతున్నారని, ఎవరైనా సరే వాళ్ళ ఉద్యోగాలు వాళ్ళకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీని కోసం తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించాలని కోరారు. అనంతరం పలు శాఖల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీ మోహన్, ఎంపిడిఒ త్రినాథ్, ఎఒ శ్రీనివాస రెడ్డి, ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, కర్రి గోపయ్య, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న ఎంపిటిసి నీలాచలం

సకాలంలో ఎరువుల్లేక రైతులకు నష్టం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వం రైతులకు సకాలంలో ఎరువులు అందించలేక పోవడం వలన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన సాధారణ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు ఎరువులు అందించడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టమైందన్నారు. ఇంకా ఎరువులు అందిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సరైన సమయంలో ఎరువులు వేయకపోవడంతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 40 శాతం ఎరువులు మాత్రమే పంపిణీ చేసి మిగిలిన 60 శాతం మందికి మొండి చేయి చూపించారని విమర్శించారు. పంపిణీ చేసిన ఎరువులు కూడా రైతుభరోసా కేంద్రం నుంచి కాకుండా కూటమి నాయకుల చేతులమీదుగా పంపిణీ చేయడం దారుణమన్నారు. ఎఒ అజయ్ కుమార్ సమాధానం ఇస్తూ ఎరువులు పంపిణీ మొత్తం రైతుసేవా కేంద్రాలు, పిఎసిఎస్ ద్వారా పంపిణీ చేసినట్లు తెలిపారు. బూర్జపాడు పంచాయతీలో నేటివరకు ఈ క్రాప్ చేయలేదని సభ్యుడు దున్న గురుమూర్తి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సమావేశానికి ఎంపిపి బోర పుష్ప అధ్యక్షత వహించారు. ఎంపిడిఒ రామారావు, తహశీల్దార్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


ఎరువుల పంపిణీపై సభ్యుల మధ్య వాగ్వివాదం



మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ


భూమిపూజ చేస్తున్న విప్ అశోక్

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి 70 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాలం అశోక్ భూమి పూజలు నిర్వహించారు. శుక్రవారం ఒకటో వార్డు నుంచి బెల్లుపడా 13 వార్డు వరకు సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయన భూమిపూజలు చేశారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, మూడోవార్డు కౌన్సిలర్ పత్రి తవిటియ్య, రాష్ట్ర కార్యదర్శి సాలీనా ఢిల్లీ, నందిగాం కోటేశ్వరరావు, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్‌కుమార్, గేదెల శేఖర్, టిడిపి నాయకులు ఎస్.శేఖర్, కృష్ణయ్య, కొరెయ్య ధర్మారాజు, కొండ శంకర్ రెడ్డి, గిన్ని వెంకట రమణ, రెయ్య జానికిరామ్, నీలపు వెంకట రెడ్డి, ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.


బదిలీ అయిన సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉత్తమ సేవలే ఉద్యోగులకు మంచి గుర్తింపునిస్తాయని సర్పంచ్ గూడ గిరిజ అన్నారు. గరుడభద్ర సచివాలయంలో గత ఐదేళ్లుగా సేవలందిస్తూ బదిలీపై వేరే సచివాలయాలకు వెళ్లిన కార్యదర్శి ఆర్.కల్యాణి, హార్టికల్చర్ అసిస్టెంట్ వై.అవినాష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఐ.శ్రీకాంత్, డిజిటల్ అసిస్టెంట్ టి.సుభాష్, విఆర్ఒ క్రాంతిలను సర్పంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీ అనేది ఉద్యోగ ధర్మంలో సహజమన్నారు. ఉద్యోగుల పనితీరు మాత్రం అక్కడ ప్రజల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయే విధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు, ఆర్.శాంతమూర్తి, .దాణేష్, కె.గణపతి, కె.మోహనరావు, సిహెచ్ పాపారావు, ఎం.నారాయణరావు, జి.ధనరాజ్, శ్రీహరి, పి.భీమారావు, శేషగిరి, ధనరాజ్, కె.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లవరాజు

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

పట్టణంలోని వివేకానంద విద్యా కేంద్ర శిశుమందిర్ పాఠశాలలో శుక్రవారం స్థానిక ఎస్ఐ లవరాజు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు, మహిళల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సంఘటనలు, వాటి ప్రభావంపై విద్యార్థులకు వివరించి అప్రమత్తంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యార్జన మంచి భవిష్యత్‌కు పునాది అని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు ప్రతీక హిందీ

ప్రజాశక్తి- పోలాకి

జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష దోహదపడిందని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జి.శాంతి అన్నారు. హిందీ వారోత్సవాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు సులభంగా నేర్చుకొనే సుందరమైన భాష హిందీ అని అన్నారు. హిందీ ఉపాధ్యాయులు హేమలత, రాజేశ్వరరావు మాట్లాడుతూ విభిన్న భాషలు గల భారతదేశంలో ప్రజలందరిలో ఐక్యమత్యాన్ని పెంచి జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలిచే భాష హిందీ అని అన్నారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు హిందీపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా 'జాతీయ బాషగా హిందీ ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, డిబేటింగ్, క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, మోహిని, వెంకటరమణ, నారాయణరావు, శ్రీహరిరావు, శాంతి, హేమలత, జగన్, బాడాన రాజు, వేణుగోపాలరావు, రాజేశ్వరరావు, రఫీ, కళావతి, సూర్యకుమారి, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.


అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ దిలీప్

అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలపై అప్రమత్తంగా ఉండాలని వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్ సూచించారు. శుక్రవారం 22వ వార్డులో కొత్తగా ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపిస్తారని, పిల్లలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త సురేఖ, నీరజ, మహిళలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా నాయుడు

ప్రజాశక్తి- పలాస


డిఎంను సన్మానిస్తున్న సిబ్బంది

ఆర్‌టిసి డిపో మేనేజర్‌గా ఎం.ఎస్.ఎస్ నాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో విశాఖపట్నం రీజనల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. గతంలో పనిచేసిన డిపో మేనేజర్ సీతారాం నాయుడు పదవి విరమణ చేయగా టెక్కలి డిపో మేనేజర్ ఇప్పటివరకు ఇన్‌ఛార్జిగా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన మేనేజర్‌ను అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ, నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు పినకాన వాలి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు, డిపో కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి


పొందూరు : తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎపిటిఎఫ్ సభ్యులు

ప్రజాశక్తి- పొందూరు

ఎపిటిఎఫ్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షుడు మోగదాల రమణరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణం అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ వెంకటేష్ రామానుజులకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శి మక్క గంగేశ్వరి, దుంపల శ్రీనివాసరావు, మాడుగుల రోజా, గురుగుబెల్లి శ్రీనివాసరావు, పప్పల రమణమూర్తి, గుడిస జవహర్ గుప్తా, దుంప రవికుమార్, దండా వెంకటరావు, పైడి కృష్ణారావు, రమణమూర్తి, నిరంజన్, ఉదయ్, గుంట కృష్ణారావు, చౌదరి మల్లేశ్వర రావు, దుంపల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టి వినతి పత్రం అందించారు. ఎ.ఢిల్లీరావు, ఎస్.చాణక్య, జి.రాజేష్, టి. సతీష్, హరీష్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

కంచిలి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిటిఎఫ్ నాయకులు తహశీల్దార్ ఎన్.రమేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంచిలి మండలం అధ్యక్షులు, కార్యదర్శి రెళ్ల కామరాజు, షణ్ముఖరావు, చాణక్య, నయన్ కుమార్, ఈశ్వరరావు, ముకుంధరావు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. డిప్యూటీ తహశీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు దున్న తులసీరావు, ప్రధాన కార్యదర్శి కుసుమూరు వెంకట్రావు, జిల్లా అకాడమీ కమిటీ సెల్ కన్వీనర్ లకినాన కరుణాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండల కేంద్రంలో ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఢిల్లేశ్వరావు అధ్యక్షతన నిరసన చేపట్టారు. తహశీల్దార్ బడే పాపారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అప్పలరాజు, అనిల్, రామారావు, సింహాచలం, వెంకటరావు,పెంటయ్య, పద్మారావు, నాయుడు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

పలాస: పలాస మండలశాఖ అధ్యక్షులు రామన్నాయుడు అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ మండలం శాఖ కార్యకర్తలు నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి టివిఎస్ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గోపికృష్ణ, వెంకటరావు, జగదీష్, పాపారావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కవిటి: ఎపిటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసనలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లపై తహశీల్దార్ మురళీ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్షుడు రుంకు కృష్ణారావు, సీనియర్ నాయకులు బెల్లెడ లక్ష్మణమూర్తి, తెప్పల రవి, పక్కి ఏడుకొండలు, గుడియా వంశీకృష్ణ, బెందాళం వెంకటేశ్వరరావు, పిరియా వేణుగోపాల్, బెందాళం లక్ష్మీనారాయణ, దుర్యోధన దొళై, మురళీధర్, కోళ్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డిప్లమో కోర్సుల కౌన్సెలింగ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు గుంటూరులోని లామ్ ఫారంలో ఈ నెల 15న స్పాట్ కౌన్సిలింగ్ జరగనుందని తొగరాం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. సీపాన నీలవేణి ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన వారందరూ హాజరుకావచ్చని, ఆంగ్రు అధికార వెబ్‌సైట్ ద్వారా ఇప్పటికే దరఖాస్తు చేసినవారితో పాటు, ఇంకా రిజిస్ట్రేషన్ చేయని విద్యార్థులు కూడా ఈ కౌన్సిలింగ్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 7702394824 ఈ ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎపిఎంపై మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి- కొత్తూరు

మండల మహాళాసమాఖ్య ఎపిఎం ఎ.లలిత కుమారి అవినీతి, అక్రమాలు, తరుచూ విధులకు గైర్హాజరు, ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసు పెడతానంటూ భయపెట్టడంపై మండల మహిళా సంఘం అధ్యక్షులు రవ్వల జయమ్మతో పాటు సభ్యులు ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. మినిట్స్ బుక్స్‌లో నమోదులో నిర్లక్ష్యం వంటి పలు అంశాలపై ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరివెంట బురాడ రమణమ్మ, పి.శ్రావణి, బోణంగి నాగమ్మ, పార్వతి, పలశెట్టి సింహ్మాద్రి, బి.భారతి, ఎస్.శిరీష, అక్కులు ఉన్నారు.

ఎక్కువ కేసుల రాజీకి చర్యలు

ప్రజాశక్తి- పలాస

పలాస కోర్టులో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ ఆదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పలాస కోర్టును ముందంజలో ఉంచాలని జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. శనివారం నిర్వహించనున్న లోక్ అధాలత్‌లో బార్ అసోషియేషన్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు కార్యవర్గం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రోసిక్యూటర్, గవర్నమెంట్ ప్లీడర్, కోర్టు సూపరెండెంట్, సిబ్బంది, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు మండలాల పోలీసులు, ఎక్సైజ్ పోలీసులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ప్రజలకు చేరువగా పాలన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో హనుమంతు నాగభూషణరావు, తమ్మినేని శ్రీనివాసరావు, పి.వి. కె రాజు, చౌదాల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణం

రణస్థలం: మండలంలోని రణస్థలం పంచాయతీ నగరపాలెంలో పిన్నింటి బడి నుంచి బండి పాలెం రోడ్డు వరకు ఎన్నో ఏళ్ల నుంచి ఇబ్బందులు పడుతున్న గ్రామస్తుల సౌకర్యార్థం రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీనాయుడు సిసి రోడ్డు నిర్మాణం చేయించారు. ఈ నిర్మాణంతో గ్రామస్థులు, మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, వాళ్లే రమణ, పంపురెడ్డి అప్పలనాయుడు, పిన్నింటి చిన్న, కెల్ల హేమంత్, వార్డ్ మెంబర్ రౌతు రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

బూర్జ: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపిపి కర్నెన దీప సూచించారు. శుక్రవారం మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలతో పాటు కెజిబివి పాఠశాల సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందజేస్తున్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహార అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ గాయత్రికి సూచించారు. జట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

నానో ఎరువుల వినియోగం పెరగాలి

శ్రీకాకుళం సిటీ: రైతులు సంప్రదాయ యూరియా బస్తాల వినియోగాన్ని తగ్గించి, నానో ఎరువులను పిచికారీ చేయడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) చైర్మన్ చౌదరి అవినాష్ తెలిపారు. గుజరాతిపేటలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్కో ఆధ్వర్యంలో శుక్రవారం నానో ఎరువులపై అవగాహన సదస్సును నిర్వహించారు. 25 బస్తాల యూరియాకు బదులుగా కేవలం అర లీటరు నానో యూరియా వాడటం ద్వారా పంటలకు సమానమైన ఫలితాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో రాష్ట్ర మేనేజర్ బి.ఎల్ రాజు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా మేనేజర్ రమణి, ఇఫ్కో జిల్లా మేనేజర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అవినాష్


టెక్కలి : లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి

ముగిసిన క్రీడలు

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న స్కూల్‌స్థాయి గేమ్స్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని సుమారు 22 పాఠశాలల నుంచి హజరైన క్రీడాకారులను వివిధ రకాల పోటీల్లో ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి క్రీడల్లో పాల్గొంటారని ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రీడల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నీకాయిట్, బ్యాడ్మింటన్, లాంగ్‌జంప్ వంటి క్రీడాపోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులను ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మణరాజా, యరపత్న వెంకటరమణ, కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ, పి.జగదీష్, ఆదిశేషు, కాపల రఘునాధరావు, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: మండలం రాజపురం ఎపి మోడల్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరిగిన మండల స్థాయి బాలబాలికల అండర్-14, అండర్-17 క్రీడా ఎంపికలు విజయవంతంగా ముగిశాయి. రెండు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 15, 16 తేదీల్లో డివిజన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని మండల ఎంఎస్ఒ ఎం.తోటారావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయిని దాటి జిల్లా స్థాయికి చేరుకోవాలని ప్రిన్సిపాల్ నవీన్ కుమార్ పాణిగ్రాహి ఆకాంక్షించారు. ఈ క్రీడా ఎంపికల్లో కవిటి మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు సమిష్టిగా పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఎంఇఒ అప్పారావు, ఎంఎస్ఒ కృష్ణ పూడియా ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జోన్‌వన్ ప్రెసిడెంట్ పద్మనాభం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను స్థానిక పెద్దలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం బల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ తడక జోగారావు, ఎస్ఎంసి చైర్మన్ జిరాజేంద్ర ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పి.రాము, జి. తిరుపతి రావు, జి.వెంకట రమణ, దేవిక, సలీం, ప్రేమలతలను దుశ్శాలువలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సిహెచ్ భారతి, స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.


సోంపేట : బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

నందిగాం: మండలంలోని దిమ్మిడిజాల గ్రామ సచివాలయ పరిధిలో బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు సర్పంచ్ సలాన కృష్ణారావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి కె సంతోష్ కుమార్, గ్రామస్తులు ఉన్నారు.

డిగ్రీ కళాశాల ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయి గుర్తింపు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకట లక్ష్మి

ప్రజాశక్తి- పలాస

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రేరణ మిత్ర పైలెట్ ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఐపి) నందు విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) వారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాష్ట్రస్థాయిలో ప్రేరణ మిత్ర పైలెట్ ప్రాజెక్టును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన 30 మంది విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో ప్రథమ శిక్షణ కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ రాష్ట్రస్థాయిలో పైలట్ ప్రాజెక్టు ఎంపిక కావడానికి ప్రోత్సహించిన డైరెక్టర్ ఆఫ్ కలేజియట్ ఎడ్యుకేషన్ ప్రతినిధి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా, జాయింట్ డైరెక్టర్ డైరెక్టర్ ఆఫ్ కాలేజీ యూత్ ఎడ్యుకేషన్ ప్రతినిధి డాక్టర్ సి.కృష్ణకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, ఆర్.అప్పారావు, శిక్షణా ఫౌండేషన్ జి.గొల్ల, జె.శంకర్, పిఎఆర్ఎల్ టీం బిసిడిఎ కోఆర్డినేటర్ ఆర్ దీపకుమారి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం కేంద్రంలోని సుప్రీం ఎల్‌టిసి వద్ద ఘనవ్యర్థాల నిర్వహణపై రెండవ రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలాస, మెలియాపుట్టి, మందస, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి ఎంపిక చేసిన 75 మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు శుక్రవారం శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డిపిఆర్‌సి టీం సభ్యులు ఘనవ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం, గృహస్థాయిలో తడి - పొడి చెత్తను వేరు చేయడాన్ని వివరించారు. చెత్త రహిత గ్రామాల సాధన, బిన్ బ్యాగ్ విధానంపై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్, మాస్క్, గ్లౌజెస్ ఉపయోగించే విధానం, ఐఇసి కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జయంతి ప్రసాద్, డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, సర్పంచ్ కె లక్ష్మి, కార్యదర్శి, డిపిఆర్‌సి టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న సిబ్బందితో అధికారులు

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కవిటి: మండలంలోని వరక గ్రామంలో బిటి రోడ్డు నిర్మాణానికి కూటమి నాయకులు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల అనుసంధానానికి నాణ్యమైన రహదారులు ముఖ్యమన్నారు. మెరుగైన రహదారుల నిర్మాణంలో భాగంగా వరక గ్రామంలో ఎన్.ఆర్.జి.ఎస్ నిధులు రూ.45 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, జెడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస రౌళో, మాజీ జెడ్‌పిటిసి బెందాళం రమేష్, సంతోష్ పట్నాయక్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతో పాటు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు అన్నారు. మండలంలోని రావాడ యూనిట్ పెదయాముల పేటలో సామూహికంగా ద్రవ జీవామృతం, జిల్లేడు ద్రావణ తయారు చేయడంపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి రమణమ్మ, జయలక్ష్మి, జనార్ధనరావు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

నందిగాం: మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తు జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు ఆందుకున్న బెందాళం రత్నంను శుక్రవారం పాఠశాలలో సత్కరించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదిన లోకనాధం చేతులమీదుగా రత్నంను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అంకితభావమే గుర్తింపు నిస్తుందన్నారు. హెచ్ఎం చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చమళ్ల సీతారాం, ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, తులసీప్రసాద్, వై.నాగేశ్వరరావు మూర్తి, గోవిందరాజు, ప్రియదర్శిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షునిగా జయరాం

నందిగాం: వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా ఉపాధ్యక్షునిగా నందిగాం సర్పంచ్ ప్రతినిధి జె.జయరాం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు. జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

చికిత్స కోసం దాతల సాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం నర్సాపురం పంచాయతీ ఆకుల సతివాణిపేటకు చెందిన ఇచ్ఛాపురం యోగి చికిత్స కోసం మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. బాధితుడు గతకొద్ది రోజులుగా బోన్‌మారో డిప్రెషన్ ప్రాణాపాయ వ్యాధితో విశాఖపట్నం కెజిహెచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన కుటుంబం పేదరికంలో జీవిస్తూ చికిత్సకోసం దాతల సహాయాన్ని కోరుతోంది. వారి పరిస్థితిని తెలుసుకున్న మనబడి వెల్ఫేర్ అసోసియేషన్, వల్లేవలస సభ్యులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, ఆనంద్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య పనులు చేస్తున్న కూలీలు

తాళ్లవలసలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస పంచాయతీలో పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామంలో వీధిరోడ్లు, కాలువల్లో పూడికలు తీయడం, చెత్త తొలగింపు, చేతిపంపులు, కుళాయిల వద్ద శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు తొలగించి బ్లీచింగ్ జల్లారు. సీజనల్ వ్యాధుల ప్రభావం లేకుండా ముందుస్తుగా జాగ్రత్తలు తీసుకున్నారు. పనులను కార్యదర్శి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. పనులను టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీమోహన్‌లు పర్యవేక్షించారు.


దోమల మందు పిచికారీ పర్యవేక్షిస్తున్న సర్పంచ్ పోలినాయుడు

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి- పొందూరు

మండలం పిల్లలవలసలో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ఆధ్వర్యంలో దోమల మందు పిచికారి కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను, కాలువల్లో చెత్త చెదారాలను తొలగించి శుభ్రపరిచారు. అనంతరం అపారిశుధ్య ప్రాంతాల్లో దోమల మందును పిచికారి చేశారు.


సాయిరాంను సన్మానిస్తున్న కిరణ్ కుమార్

సాయిరాంకు కిరణ్ సత్కారం

ప్రజాశక్తి- రణస్థలం

వైసిపి రాష్ట్ర అనుబంధ వాణిజ్య జాయింట్ సెక్రటరీగా మండల కేంద్రానికి చెందిన వైసిపి నాయకులు, ఆర్యవైశ్య సంఘ ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ని స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సాయిరాంకు మాజీ ఎమ్మెల్యే శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పనిసరిగా గుర్తింపు వస్తుందన్నారు.


మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలయ్య

శాంతిని కలిసిన నాయకులు

కొత్తూరు: పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని శుక్రవారం మండల కేంద్రానికి చెందిన వైసిపి కార్యకర్త గుదిబండ పోలయ్యను జిల్లా ఎస్‌సిసెల్ కార్యదర్శిగా నియమించినందుకు వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పాతపట్నం తన క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు అగతముడి నాగేశ్వరరావు, రంజిత్ కుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కంచిలి: మండలంలోని ఎంఎస్ పల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆపూరి జానకి రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. వమ్మరవల్లి డైట్ కళాశాలలో జరిగిన పోటీల్లో పాల్గొన్న జానకి ప్రథమస్థానం పొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని ప్రిన్సిపాల్ శివప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.


నిర్వాహకుల నుంచి బహుమతి అందుకుంటున్న జానకి